
# * ప్రమోషన్ *

అదొక ప్రైవేట్ కంపెనీ. అందులో పనిచేసే సేల్సు ఎగ్జిక్యూటివ్ నారాయణ రిటైరయ్యాడు. కంపెనీ స్టాఫ్ అతనికి ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటుచేశారు.

పార్టీ మధ్యలో ఇద్దరు సంతోషంతో కెవ్వున కేకేసి అంతెత్తున ఎగిరారు.




"మనం తెచ్చిన స్వీటో టూటో బాగున్నట్టున్నాయి. మూడు సంతోషం పట్టలేక ఎలా గంతులేస్తున్నారో!!..." అన్నాడు పార్టీని ఆర్గనైజ్ చేసిన వాళ్లలో ఒకడు.

"ఛీ ... అందుక్కాదు... హెయ్య..." మళ్ళీ ఇద్దరూ సంతోషంతో ఎగిరారు.

వాళ్ళిద్దరి పేర్లూ కాకారావు, బాకారావులు – ఆ కంపెనీలో అసిస్టెంటు సేల్సు ఎగ్జిక్యూటివ్‌స్‌గా పనిజేస్తున్నారు.

"మరి?" అడిగాడు ఆర్గనైజర్.

"సేల్సు ఎగ్జిగ్యూటివ్ పోస్టు ఖాళీగా..." అన్నాడు కాకారావు.

"అది నాకేగా..." అన్నాడు బాకారావు

"మీదెలాగవుతుంది... అది నాదే..." అన్నాడు కాకారావు గుర్రుగా బాకారావు వంక చూస్తూ.

"చాల్లాల్లే ఎవరైనా వింటే నవ్వుతారు... ఆ పోస్టు నాదే... ప్రమోషన్ నాకే..." అన్నాడు బాకారావు
అక్కడ ఉన్న అందరూ ఘొల్లున నవ్వారు.
మీ ఇద్దరూ నోరుముయ్యండి... ఉన్నది ఒక్కటే సేల్సు ఎగ్జిక్యూటివ్ పోస్టు ... మీ ఇద్దరూ మీ మీ సత్తా చూపించుకోండి... ఎవరు నెగ్గితే వాళ్ళకే ప్రమోషన్" అన్నాడు వేదిక మీంచి ఆ కంపెనీ మేనేజింగ్ డైరక్టర్ కాళేశ్వరరావు విలాసంగా కాళ్ళూగిస్తూ.
హఠాత్తుగా పార్టీలో ఉన్న ఆడవాళ్ళు కెవ్వున కేక వేశారు.
"ఛీ..."
"యాక్..."
"ఛిఛ్ఛీ..."
ఆడాళ్ళందరూ కళ్ళు మూస్కున్నారు. కారణం - ఒంటిమీద బట్టలన్నీ విసిరేసి కట్ డ్రాయర్లతో నించుని ఉన్నారు కాకారావు, బాకారావు.
"రారా ... రా..." తొడకొట్టి పిలిచాడు కాకారావు.
"నువ్వే రారా... రా..." రెండు తొడలూ కొట్టి కవ్వించాడు బాకారావు.
"ముందు మీరు బట్టలేస్కోండి. లేకపోతే ఎవరికీ ప్రమోషన్ లేదంతే..." గావుకేక పెట్టాడు కాళేశ్వర్రావు.
ఇద్దరు నాలుక్కరుచుకుని చెంపలేస్కుని గబగబ బట్టలేస్కున్నారు.
"కంపెనీలో ఇన్నాళ్ళుగా పనిచేస్తూ కొత్త మేళాల్లా ప్రవర్తిస్తారేం?... సత్తా చూపించుకోడం అంటే ఏంటో వీళ్ళకి నువ్వు చెప్పవయ్యా నారాయణా!" అన్నాడు మేనేజింగ్ డైరెక్టర్ రిటైరయిన సేల్సు ఎగ్జిక్యూటివ్ నారాయణతో.
పార్టీ అయ్యింది.
నారాయణ స్టాఫ్ అందర్నీ కలిశాడు. ఆ తంతు పూర్తికాగానే కాకారావు, బాకారావు నారాయణని పట్టుకున్నారు.
"సత్తా చూపించుకోడం అంటే ఏంటో తెలీకపోవడం ఏమిటయ్యా?... ప్రైవేటు కంపెనీల్లో ప్రమోషన్లు ఎలా వస్తాయి?" అన్నాడు నారాయణ.
"బాగా కష్టపడి పనిజేస్తే వస్తాయి...నాలాగా..." అన్నాడు బాకారావు గర్వంగా.
కాకారావు కిసుక్కున నవ్వాడు.
"హబ్బే... నువ్విలా అనుకుంటే లాభం లేదు... కాకారావు కిసుక్కున నవ్వాడు కాబట్టే కాకారావుకి తెలిసిపోయి ఉండాలి... చెప్పు కాకారావ్...

ఏం చెయ్యాలి? " అడిగాడు నారాయణ.
"కాకా పట్టాలి!..." అన్నాడు కాకారావు.
"విన్నావా?..." అన్నాడు నారాయణ పక్కకి తిరిగి చూస్తూ. కానీ అక్కడ బాకారావు లేడు.
"అర్రే... ఏడీ వీడు?!" ఆశ్చర్యపోయాడు. కాకారావు.
"కాకా పట్టటానికి వెళ్ళిపోయి ఉంటాడు..."
"బాబోయ్..." గుండెలు బాదుకుంటూ కాళేశ్వరరావు ఇంటివైపు పరుగుతీశాడు కాకారావు. అక్కడ....
కాళేశ్వర్రావు ఇంటి దగ్గర...
"చిచ్చీ... హెంత ముద్దొస్తున్నావో బాబూ..." బాబ్జీని ఎత్తుకుని బుగ్గలు నిముర్తూ అన్నాడు బాకారావు.
"నన్ను దించెయ్... నేనాడుకోవాలి" అన్నాడు బాబ్జీ.
"చాల ముద్దొస్తున్నాడు కద్సార్ మీ అబ్బాయి? హిహిహి ..."
"నన్ను దించమంటుంటే... నేనాడుకోవాలి..." సీరియస్‌గా అన్నాడు బాబ్జీ.
"ప్లీజమ్మా... నిన్ను దింపమని అడగొద్దమ్మా... నిన్ను నేను ఎత్తుకోవాలమ్మా..." బతిమిలాడాడు బాకారావు.
"ఛీ... నన్నాడుకోనివ్వరు... " బాకారావు మొహం మీద అరచేత్తో ఓ చరుపు చరిచాడు బాబ్జీ.
బాకారావు కళ్ళ ముందు చుక్కలు తిరిగాయి.
"అర్రె ! ... ఈ చుక్కల మధ్య ఏదో ఆకారం కనిపిస్తుందే!!... ఎవరూ చంద్రుడా, ఇంద్రుడా?" కళ్ళు రెపరెపలాడిస్తూ చూశాడు.
"ఇంద్రుడూ కాదు చంద్రుడూ కాదు... సరిగ్గా చూడ్రా..." అంది ఆ ఆకారం.
ఎక్కడో విన్న గొంతులా ఉందే!!... మళ్లీ కంటిరెప్పలు రెపరెపలాడించి చూశాడు.
క్షణాల్లో చుక్కలు మాయమై అక్కడ కాకారావు కనిపించాడు.
"ఏం?... నా కళ్ళు కప్పి ఇక్కడికి వస్తే నేను తెల్సుకోలేనను కున్నావా?... ఇంత సేపూ బాబుని నువ్వెత్తుకున్నావ్‌గా... ఇప్పుడు నాకివ్వు..." అన్నాడు ఉగ్రరూపం దాలుస్తూ రెండు చేతులూ ముందుకి చాపి కాకారావు.

"ఉహూ... బాబుని నేనే ఎత్తుకుంటా... బాబు చాలా ముద్దొస్తున్నాడు..." అన్నాడు బాకారావు.

"ఛీ ... నన్నాడుకోనివ్వరు..." బాబ్జీ మళ్ళీ అరచేత్తో బాకారావు మొహం మీద చరిచాడు.

బాకారావు కళ్ళముందు మళ్ళీ చుక్కలు తిరిగాయ్.

క్రమంగా చుక్కలన్నీ మాయమైన తరువాత అక్కడో ఘోరాతి ఘోరమైన, భయంకరమైన దృశ్యం కనిపించింది బాకారావుకి.

ఇంటిముందున్న పూల మొక్కలకీ, క్రోటన్స్‌కీ నీళ్ళు పోస్తూ కనిపించాడు కాకారావు.

"ఏం?... నీ ఒక్కడికే చేతనవ్వునా... హూ!" బాకారావుని చూసి మెడ ఎగరేశాడు కాకారావు.

బాకారావు బాబ్జీని కిందికి దించి గుండెలు బాదుకుంటూ కాకారావు దగ్గరికి పరుగెత్తుకు వెళ్ళాడు.

"నువ్ లే... మొక్కలకి నీళ్ళు నేను పోస్తాను..."

"హూ!... నువ్వింత సేపు బాబ్జీని ఎత్తుకోలేదా? మొక్కలకి నీళ్ళు నేనే పోస్తాను... " అన్నాడు ఉక్రోషంగా కాకారావు.

"నేనే పోస్తాను..." బాకారావు మీది మీదికి వెళ్ళాడు.

ఇంతలో కాళేశ్వరరావు భార్య రాజేశ్వరమ్మ బయటికి వచ్చింది.

"ఏవండోయ్... ఇంట్లో కూరగాయలు అయిపోయాయ్... ప్యూన్ని బజారుకి పంపించి తెప్పించండి... " అంది భర్తతో.

ఆవిడ మాటల్ని విన్న బాకారావు ఒక్క ఉదుటున పరుగెత్తుకు వచ్చాడు.

"ఈ మాత్రం దానికి మీ ప్యూను గారికి శ్రమివ్వడం ఎందుకండీ... నేనెళ్ళి తెస్తా కూరగాయలు... హిహిహి.. ." అన్నాడు బాకారావు రాజేశ్వరమ్మతో.

"అలాగేలే... ఏవండీ... ఇతనికి కూరలకి డబ్బులివ్వండి... "

"ఇదిగోనోయ్ ... " జేబులోంచి డబ్బులు తీశాడు కాళేశ్వరావు.

"హమ్మమ్మ... మీ దగ్గర డబ్బులు తీస్కుంటానా సార్?... వస్తాను సార్..." బాకారావు అడుగులు ముందుకు వేశాడు.

"చూడు తమ్మీ... కాస్త ఆ చేత్తోనే నాకు బీడీలు కూడా తెచ్చి పెట్టు..." అన్నాడు ప్యూను రంగయ్య.

"అలాగేనండీ... తప్పకుండా..." బాకారావు బయటికి వెళ్తూ కాకారావు వంక చూసి గర్వంగా నవ్వి కళ్ళెగురవేశాడు.

కాకారావు మొహం మాడ్చుకున్నాడు.
"వాడు తెచ్చే బీడీలేం తాగుతావ్ లే... నీకు మాంచి ఇంపోర్టెడ్ సిగరెట్లు తెచ్చిస్తానులెండి రంగయ్యగారూ..." అన్నాడు కాకారావు రంగయ్యతో.
"ఇంతకీ మీకు ప్రమోషనిచ్చేది వాడా నేనా?..." రంకె వేశాడు కాళేశ్వర్రావు.
కాకారావు చెంపలు వేస్కున్నాడు.
"మీరేనండీ... మీరే. ఇంపోర్టెడ్ సిగరెట్లు మీకే తెచ్చి పెడ్తానండీ..."
పది నిమిషాల తరవాత కూరగాయలు పట్టుకొచ్చిన బాకారావు మరో భయంకరమైన దృశ్యం చూశాడు.
కాకారావు కాళేశ్వర్రావు గెడ్డం గీసేస్తున్నాడు. డంగైపోయి చూస్తున్న బాకారావు వంక చూసి "ఎలా కొట్టాను దెబ్బ?" అన్నట్టు నవ్వాడు.
వెంటనే బాకారావు కూరగాయల సంచి ఓ మూలకి గిరాటేసి కాళేశ్వర్రావు బూట్లు తీస్కుని పాలిష్‌చేస్తూ కాకారావు వంక చూసి విలాసంగా నవ్వాడు.
గబగబ షేవ్ చేసేసి కాకారావు రాజేశ్వరమ్మ చీరలు ఉతికేసి ఆరేసి వికటాట్టహాసం చేశాడు.
బాకారావు కూరగాయలు కసకస తరిగేసి కిందపడి దొర్లుతూ నవ్వాడు.
"ఇంక చాల రాత్రయింది... మీరెళ్ళిపోండి" అన్నాడు కాళేశ్వర్రావు.
ఇద్దరూ ఇళ్ళకి వెళ్ళిపోయారు.
రోజూ ఇదే తంతు ఓ నెలపాటు జరిగింది.
సేల్సు ఎగ్జిక్యూటివ్ పోస్టులోకి ఒకతను ప్రమోట్ చెయ్యబడ్డాడు. కానీ ఆ ఒకతనూ బాకారావుగానీ కాకారావుగానీ కాదు. అతను అప్పారావు!
"నువ్వసలు మన మేనేజింగ్ డైరెక్టర్ ఇంటి దగ్గరే కనిపించలేదు... నీ కసలు ప్రమోషన్ ఎలా వచ్చింది?" ఆశ్చర్యంగా అడిగారు కాకారావు, బాకారావులు.
"నేను కాళేశ్వర్రావు ఉంచుకున్నావిడ చింతామణి ఇంటిదగ్గర పన్జేశాను...." గర్వంగా అన్నాడు అప్పారావు.
కెవ్వుమని కేకేసి వెనక్కి విరుచుకు పడిపోయారు కాకారావు, బాకారావులు.

* * *